క్లుప్తంగా

దీపోత్సవంపై 22న సమావేశం

పద్మనాభం: పద్మనాభంలో డిసెంబర్ 12న జరగనున్న అనంత పద్మనాభ స్వామి దీపోత్సంపై ఈ నెల 22న సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో నానాజీ బాబు తెలిపారు. ఉదయం పది గంటలకు అనంతుని కల్యాణ మండపంలో నిర్వహించనున్న సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న కార్తీక దామోదర ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథస్వామి

కొమ్మాది: బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో కార్తీక దామోదర మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథ స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం మంగళ హారతితో ప్రారంభమై గోపీ గీత, భగవద్గీత 12వ అధ్యాయం, శిక్షాష్టకం పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉప్పాడలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొమ్మాది: నేవీ డే సెలబ్రేషన్స్ – 2023లో భాగంగా భీమిలి బీచ్ రోడ్డు ఉప్పాడ గ్రామంలో హెచ్‌క్యూ ఈఎన్‌సీ ఆధ్వర్యంలో కళ్యాణి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 316 మందికి వైద్య పరీక్షలు చేశారు. కంటి, చర్మ, దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్‌ఎస్) శిక్షణ అందించారు. కార్యక్రమంలో ఐఎన్‌ఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకు మన ప్రభుత్వం' నేడు

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీలో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. ఇదే రోజు ఉదయం పది గంటలకు కొవ్వాడ సచివాలయం వద్ద ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సంక్షేమ పథకాల సమాచార పట్టిక బోర్డు ఆవిష్కరిస్తారని ఎంపీడీవో తెలిపారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం: మండలంలోని బి.ఆర్.తాళ్లవలస, బొత్సపేట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక సభ్యులు ఆదివారం ప్రచారం చేశారు. భగవద్గీత ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, జి.కృష్ణ సూరప్పడు, బి.అప్పలనాయుడు, కె.రాజు, కె.లక్ష్మి, జి.భారతి పాల్గొన్నారు.


క్రికెట్ వీక్షణకు తెరలు ఏర్పాటు

తగరపువలస: భారత్ – ఇండియా జట్ల మధ్య ఆదివారం అహ్మదాబాద్‌లో జరుగుతున్న క్రికెట్ ప్రపంచ కప్ – 2023 ఫైనల్స్ మ్యాచ్ తిలకించడానికి అభిమానులకు బహిరంగ ప్రదేశాల్లో స్క్రీన్లను ఏర్పాటు చేశారు. చిట్టివలస బంతాట మైదానంతోపాటు లక్ష్మి శ్రీనివాస కల్యాణ మండపం వద్ద బహిరంగ ప్రదేశంలో తెరలు ఏర్పాటు చేశారు.

మధురవాడ: ఇండియా – ఆస్ట్రేలియా మధ్య వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ చూసేందుకు క్రీడాకారులు, క్రీడాభిమానులు టీవీలు, భారీ స్క్రీన్‌లకు అతుక్కుపోయారు. మధురవాడ శివశక్తినగర్ రోడ్డులోని లక్ష్మీ టవర్స్ అపార్ట్‌మెంట్ వాసులు భారీ స్క్రీన్ ఏర్పాటు చేసి మ్యాచ్ తిలకించారు.




గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాల



టి.నగరపాలెం ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతి గదిలో విద్యార్థులు

మన బడి 'నాడు - నేడు'

సర్కారు బడి.. కార్పొరేట్ రూపు..!!



రేపటి తరం ఉజ్వల భవిత కోసం దూరదృష్టితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా విధానంలో విప్లవం తీసుకొచ్చారనే చెప్పుకోవాలి. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలు సరికొత్త రూపు సంతరించుకున్నాయి. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా వసతులు సమకూరాయి. విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 'నాడు – నేడు' పథకంలో భాగంగా విడతల వారీగా పాఠశాలలను ఆధునికీకరించి అవసరమైన వసతులు కల్పించిన సంగతి తెలిసిందే. గాలి, వెలుతురు తగిలేలా ఆరోగ్యకర వాతావరణంలో విద్యాభోధనకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశారు.

తగరపువలస : సీఎం జగన్ ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మార్చేశారు. ఇది మా ప్రభుత్వ పాఠశాల అని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గర్వంగా చెప్పుకునేలా వసతులు కల్పించారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేని కారణంగా తల్లిదండ్రులు ప్రైవేటు స్కూళ్లను ఆశ్రయించి ఫీజులు, పుస్తకాల కోసం అప్పుల పాలయ్యేవారు. ముఖ్యంగా తరగతి గదులు, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫర్నీచర్, టాయిలెట్లు వంటి వసతులు, ప్రహరీలు లేకపోవడంతో పాఠశాలల ఆస్తులకు రక్షణ ఉండేది కాదు. 'నాడు – నేడు' పేరుతో చేపట్టిన అభివృద్ధి పనుల పుణ్యమా అని ప్రస్తుతం తరగతి గదుల్లో మార్బుల్ గచ్చులు, విద్యార్థులు కూర్చునేందుకు ఫర్నీచర్, డైనింగ్ హాలు, ఆర్వో వాటర్ ప్లాంట్, ప్రహరీ, డిజిటల్ తరగతి గదులు, స్మార్ట్ టీవీలు, ఇంగ్లిష్ ల్యాబ్, కాలింగ్ బెల్, విలువైన గ్రీన్ చాక్ బోర్డులు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, ఆకర్షణీయమైన ముఖద్వారాలు, ఖరీదైన టాప్‌లతో కూడిన వాష్‌రూమ్‌లు, హ్యాండ్ వాష్ పైపులు, వివిధ అక్షరాల బొమ్మలతో కూడిన వాల్ పెయింటింగ్‌లు అమర్చారు. రోజూ విద్యార్థులకు ఆటలు తప్పనిసరి చేసి ఆట స్థలాలనూ ఆధునికీకరించారు. ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతోపాటు 8వ తరగతి నుంచి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ఖరీదైన ట్యాబ్‌లు అందించారు. మరోవైపు విద్యార్థుల సంపూర్ణ శ్రేయస్సే ధ్యేయంగా అమ్మఒడి, విద్యాకానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలు అమలు చేస్తున్నారు.



చంద్రంపాలెం హైస్కూల్ ఆవరణలో బాస్కెట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తున్న బాలికలు

శిథిలావస్థ నుంచి సుందరంగా...

పద్మనాభం: మండలంలో మొదటి విడతలో 'నాడు – నేడు' ద్వారా రూ.6.51 కోట్లతో 15 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, ఐదు జెడ్పీ హైస్కూళ్లు, ఒక కస్తూర్బా విద్యాలయం భవనాలను ఆధునికీకరించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వసతుల లేమితో కొట్టుమిట్టాడిన అనంతవరం, ఐనాడ, బి.తాళ్లవలస, చిన్నాపురం, గంధవరం, గెద్దపేట, కృష్ణాపురం, మద్ది, నేరేళ్లవలస, పద్మనాభం, రెడ్డిపల్లి, రౌతులపాలెం, తునివలస, ఆర్.వి.పురం, విజయరాంపురం ప్రాథమిక పాఠశాలలు, పొట్నూరు, పాండ్రంగి, కొత్త కొవ్వాడ ప్రాథమికోన్నత, బి.తాళ్లవలస, మద్ది, రెడ్డిపల్లి, రేవిడి, పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పద్మనాభం కస్తూర్బా విద్యాలయాలను ఆధునికీకరించారు. కొత్త భవనాల నిర్మాణంతోపాటు మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్‌లు నిర్మించారు. ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నారు. రెండో విడతలో రూ.6.73 కోట్లతో ఆరు అంగన్‌వాడీ, 17 ప్రాథమిక, ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆధునికీకరిస్తున్నారు. కొయ్యపేట, సామయ్యవలస, మర్రిబంద, సుంకరపేట, తిమ్మాపురం, మునివానిపాలెంలోని అంగన్‌వాడీ భవనాలు, అనంతవరం, లింగన్నపేట, బొత్సపేట, బుడ్డివలస, గంధవరం, గెద్దపేట, కోరాడ, కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, మద్ది, నరసాపురం, అర్చకునిపాలెం, సంగుపేట, కురపల్లి, అన్నంపేట, తునివలస, వెంకటాపురం కళ్లాలు ప్రాథమిక పాఠశాలలు, రెడ్డిపల్లి, పాండ్రంగి, విజయానందపురం, మద్ది, గంధవరం, అనంతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నారు.



ఆధునికీకరించిన రౌతులపాలెం ప్రాథమిక పాఠశాల భవనాలు



రౌతులపాలెం పాఠశాలలో మురుగుదొడ్లు, హ్యాండ్ వాష్

'నాడు - నేడు'లో అభివృద్ధి చేసిన పాఠశాలలు

(భీమిలి, ఆనందపురం, పద్మనాభం, చినగదిలి (మధురవాడ) వరకు)

మొత్తం పాఠశాలలు	295
నాడు - నేడు ద్వారా ఆధునికీకరించిన పాఠశాలలు	247
మొదటి విడతలో 97 పాఠశాలలకు	రూ.28.86 కోట్లు
రెండో విడతలో 150 పాఠశాలలకు	రూ.52.42 కోట్లు
పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఖ్య	1376
ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య	27,149
2018-2019లో విద్యార్థుల సంఖ్య	25,593
పెరిగిన విద్యార్థుల సంఖ్య	1556

కళ్ల ముందే అభివృద్ధి



ప్రభుత్వ పాఠశాలలు 2020 నుంచి వేగంగా అభివృద్ధి చెందాయి. గతంలో మేము కూడా ప్రభుత్వ పాఠశాలల వైపు చూసేవారం కాదు. ఇప్పుడు మాలాగే చాలా మంది అడ్మిషన్ల కోసం ప్రభుత్వ పాఠశాలల ముందు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం జగన్ అన్ని వసతులు కల్పించి విద్యార్థులకు భరోసా, తల్లిదండ్రులకు ధీమా కల్పించారు.

– పిల్లా లీలావతి, విద్యార్థి తల్లి, బంగ్లామెట్ట

సహకార సంఘాలతో రైతులకు సేవలు

ఆనందపురం : గ్రామాల్లో ఏర్పాటు చేసిన సహకార సంఘాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందిస్తున్నామని కేంద్ర సహకార బ్యాంక్ మధురవాడ బ్రాంచి మేనేజర్ మురళి చెప్పారు. మండలంలోని వేములవలస సహకార సంఘంలో ఆదివారం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం జెండా ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ అన్ని బ్యాంక్‌లకంటే బంగారు ఆభరణాలపై రుణాలు సులభంగా రైతులకు అందిస్తున్నామని చెప్పారు.

ఖరీఫ్, రబీలోనే కాకుండా రైతులకు ఉన్న భూములను బట్టి పెద్ద మొత్తంలో దీర్ఘకాలిక రుణాలు తక్కువ వడ్డీలకే అందిస్తున్నామని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతులు, డ్వాక్రా మహిళలు గ్రూపులుగా ఏర్పడితే స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు మరుపిళ్ల రామసత్యం, కార్యదర్శి దశావతారం, మధురవాడ బ్రాంచి సూపర్‌వైజర్ వేణు పాల్గొన్నారు.

మహిళా నేతలకు స్ఫూర్తి ఇందిరా గాంధీ



ఇందిర విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు



ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

ఆనందపురం : దేశ తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీ నేటి మహిళా నేతలకు స్ఫూర్తిదాయకమని ఆనందపురం ఉప సర్పంచ్ బంటుబిల్లి రమణమ్మ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఇందిరా గాంధీ జయంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ బీవీఎస్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల పితామహులు అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఎస్.ఆర్.రంగనాథన్ తదితరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమాజంలో గ్రంథాలయాల పాత్రపై వ్యాసరచన, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై ఉపన్యాస పోటీలు, దేశభక్తికి సంబంధించి చిత్రలేఖనం, పాటల పోటీలు తెలుగు, హిందీ భాషలలో నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు తెడ్డు రాందాసు ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పళ్లు, రొట్టెలు అందించారు.

నిత్యావసర సరకుల పంపిణీ

పీఎం పాలెం : శ్రీ సత్యసాయి జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు 15 రకాల సరకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సాయి సమితి కన్వీనర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న భక్తులు

పీఎం పాలెం: స్థానిక శ్రీ శృంగేరీ శంకర మఠంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో సత్యదేవుని వ్రతం విశిష్టత, మహిమ వివరించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన ప్రసాదం స్వామికి నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టాపనలో అర్చకులు, నిర్వాహకులు

మధురవాడ: శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో కాశీ విశ్వేశ్వర స్వామి, నందీశ్వరుల విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జీవీఎంసీ 6వ వార్డు నవోదయ సమీపంలో నిర్వహించిన ఉత్సవాలు ఆద్యంతం భక్తి పారవశ్యాన్ని నింపాయి. అర్చకులు రాజేటి గురునాథ శర్మ, రాజేటి నరసింహమూర్తి శర్మ, దార్లపూడి సత్యప్రసాద్ శర్మ, జ్యోశ్యుల వెంకట శివప్రసాద్ శర్మ సారథ్యంలో పిల్లా రేవతిరావు, బొల్లంరెడ్డి జగన్నాథస్వామి, సుగుణ, చెన్నుపాటి శ్రీకాంత్‌దంపతులు, పోతిన రేవంత్ కుమార్ తదతరులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలు ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

లక్ష్మీపురం విద్యార్థుల సత్తా





కరుభుక్త ధనలక్ష్మి, బమ్మిడి ప్రవీణ్

తగరపువలస: ఇటీవల నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్ – 17 బాలబాలికల రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో భీమిలి మండలం లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థిని కరుభుక్త ధనలక్ష్మి విశాఖ జిల్లా తరఫున ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే ఈ నెల 20 నుంచి విజయవాడలో జరిగే అండర్ – 14 బాలబాలికల రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో ఇదే పాఠశాల 8వ తరగతి విద్యార్థి బమ్మిడి ప్రవీణ్ పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా ఇద్దరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.లలిత్‌కుమార్, ఉపాధ్యాయులు పైడినాయుడు, అంబిక, విజయ్, లక్ష్మణ్, బషీర్ తదితరులు అభినందించారు.

కార్తీకమాస పూజలకు శివాలయాలు సిద్ధం



టి.నగరపాలెంలోని శివాలయం

తగరపువలస: కార్తీక మాసం మొదటి సోమవారం పూజలకు భీమిలిలోని శివాలయాలు సిద్ధమయ్యాయి. వేకువ జాము నుంచే భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఆలయాల చుట్టూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. క్యూ లైన్లు సిద్ధం చేశారు. ఆలయాల ముందు షామియానాలు వేసి, విద్యుత్ అలంకరణతో ముస్తాబు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని స్వాములకు ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయాల్లో పంచామృతాలతో అభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేకాల కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. బంగ్లామెట్ట, బసవపాలెం, అమనాం, తాటితూరు, సంగివలస, చిట్టివలస, టి.నగరపాలెం గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.